# లీప్వార్క్ణి

కోపూరి పుష్పాదేవి

ఆ ఉషోదయం జగమంతా కాంతులు నింపినా, నారాయణమూర్తి ముఖంలో మాత్రం నీలినీడలు తారట్లాడుతున్నాయి.

''ఏమండీ... చాలా నీరసంగా కన్పిస్తున్నారు. ఈ హార్లిక్స్ తాగండి'' అన్నది వరలక్ష్మి దిగాలుగా కూర్చున్న నారాయణ మూర్తిని చూస్తూ.

''ఇంక నా బతుకులో నీరసంగాక మరేముందని...? దేనికీ పనికిరాని వాడిని. తిని కూర్చుని ఇలా నీచేత చాకిరీ చేయించుకోవడానికి నాకు చాలా సిగ్గుగా ఉంది వరం'' అన్నాడు నారాయణమూర్తి ఆమె చేతిలోని హార్లిక్స్ కప్పువంక నిర్లిప్తంగా చూస్తూ.

''ఏమిటండీ మీ ధోరణి...? రోజు రోజుకీ మరీ శృతి మించుతోంది. రిటైరయ్యి మూడు నెలలన్నా కాలేదు, ఆ ఉద్యోగం చేసినన్నాళ్ళూ నాకన్నీ, పిల్లలకన్నా ఆఫీసే ముఖ్యమన్నట్లూ, అదే మీ ప్రాణమన్నట్లూ బతికారు. ఇప్పుడు వయసు దాటిపోయింది కనుక ఇక హాయిగా విశ్రాంతి తీసుకొమ్మంటే, అదేదో మిమ్మల్ని అవమానం చేసినట్లు భావించి అన్నం తినకా, నిద్రపోకా ఏమిటేమిటో ఊహించుకుంటూ అంతులేని బాధపడిపోతున్నారు. మీ సంగతి నాకేమీ అర్ధంకావడంలేదు'' భర్త మీద విసుక్కుంది వరలక్ష్మి.

నారాయణమూర్తి ఎకౌంట్స్ ఆఫీసరుగా రైల్వేలో పనిచేసి మూడునెలలక్రితం పదవీ విరమణ చేశాడు. అప్పటి నుంచీ అతని ధోరణి ఇలా మారిపోయింది.

''ఏమిటి పిన్నీ... బాబాయిని అంతలా విసుక్కుంటున్నావు ఏం జరిగింది'' అంటూ వచ్చాడు విష్ణు. అతను వరలక్ష్మికి అక్క కొడుకు. ఆ ఊళ్ళోనే టాటా కంపెనీలో సేల్స్ ప్రమోటర్‌గా పనిచేస్తున్నాడు.

''చూడరా విష్ణూ మీ బాబాయి... నా మెదడు తింటున్నారు. ఆ ప్రభుత్వం వారు ఈయన్ని రిటైర్ చేసి ఇంటికి వెళ్ళమనేసరికి ఈయనకి బుర్ర చెడిపోయింది. ''ఇంక నేను దేనికీ పనికిరాను, వేస్ట్‌ఫెలోని అంటారు. కనీసం కూరలు తెమ్మంటే తీసుకురారు. ఏదో ఒకటి చేసి సరిపెట్టు అంటారు. వెచ్చాలు తెమ్మంటే ఓపికలేదంటారు. మరీ గెడ్డమన్నా చేసుకోకుండా, బూచాడిలా ఎలా తయారయ్యారో చూడు, ఏమిటో నీరసం, నీరసం అంటూ ఆ మంచం వదలరు. సర్వం కోల్పోయినట్లు డిప్రెషన్‌లో మునిగిపోయి, ''ఇంక నాకు తిండి కూడా దండగ' అని తెగ బాధపడిపోతున్నారు. ఏం చెయ్యాలో నాకు తోచడంలేదు'' కన్నీళ్ళు ఒక్కటే తక్కువగా ఉన్నాయి ఆమెకి.

''అరెరే... ఇంత చిన్న విషయానికి ఇద్దరికి ఇద్దరూ అంత బాధపడిపోతున్నారే... అసలు ఇప్పుడు మీకు మంచి అవకాశం దొరికింది తెలుసా...?

''అవకాశమా...?'' ఇద్దరూ ఒకేసారి అడిగారు.

''అవకాశమంటే అలాంటి ఇలాంటి అవకాశం కాదు, చాలా గొప్ప అవకాశం, బ్రహ్మాండమయిన అవకాశం...''

''ఏరా, నీకు మేమేమన్నా చంటి పిల్లల్లా కన్పిస్తున్నామా... మమ్మల్ని మాయ బుచ్చుదామనుకుంటున్నావా...?''

''అబ్బే... అదేం లేదు బాబాయ్... నేను నిజమే చెబుతున్నాను''

''అయితే అదేదో త్వరగా చెప్పు. ఊరించి చంపకు...''

''ఉహూఁ ఊరికే చెప్పేస్తానా ఏమిటి? ముందు నాకు కాఫీ, టిఫినూ లంచం కావాలి'' అన్నాడు విష్ణు అక్కడే వున్న దినపత్రిక అందుకుని సోఫాలో సెటిలవుతూ.

''ఓరినీ అసాధ్యం కూలా... నీకు కాఫీ టిఫిను లంచమట్రా...'' నవ్వుకుంటూ వంటగదిలోకి వెళ్ళింది వరలక్ష్మి.

వరలక్ష్మికి కూతుళ్ళు లేరు. కొడుకులిద్దరూ దూరంగా వేరే వేరే ఊళ్ళల్లో ఉద్యోగాలు చేస్తుండటంతో ఆమెకు కావలసిన చిన్నపనీ, పెద్దపనీ చేసిపెడుతూ ఆ దంపతులకు కుడిభుజంలా మసలుతుంటాడు విష్ణు.

కమ్మకమ్మటి వేడి వేడి పెసరట్లు ఉప్మాతో కడుపు నిండా తిని, తీరుబడిగా కాఫీ తాగి, అప్పుడు మొదలుపెట్టాడు విష్ణు ''చెప్పు బాబాయ్... అసలు నీ సమస్య

ఏమిటి అంటూ''

భారంగా నిట్టూర్చి అన్నాడు నారాయణ మూర్తి ''ఏముందిరా, అప్పుడు ఉద్యోగం చేసినన్నాళ్ళూ బతుకు ఉరుకులు, పరుగులు అన్నట్లు ఉండేది. అసలు కాలం ఎలా గడుస్తోందో కూడా తెలిసేది కాదు. అటువంటిది ఇప్పుడు పొద్దస్తమానూ ఖాళీగా కూర్చోమంటే విసుగు పుడుతోంది. ఎంతసేపని పేపరు చదువుతాం...? ఎంత సేపని టీవీ చూస్తాం...? గడియారంలో ముళ్ళు కదల మని మొండికేస్తున్నాయి. ఏమిటో అసలు జీవితమే స్థంభించిపోయినట్లు అనిపిస్తోంది. ఆకలెయ్యదు. నిద్ర రాదు. ఎందుకొచ్చిన బతుకు అన్నట్లుంటోంది''

''అదిగో అదిరా విష్ణూ ఆయన ధోరణి. నాకయితే భయమేసి పోతోందనుకో...''

''పరిస్థితి చాలా సీరియస్‌గానే ఉంది గానీ, దీనికో మందు ఉంది పిన్నీ''

''మందా...? ఏ డాక్టరు దగ్గరకన్నా వెళ్ళమంటావా ఏమిటి?'' నారాయణమూర్తి కంగారు పడ్డాడు.

''ప్రస్తుతానికి ఆ డాక్టరును నేనే. ఫీజు మాత్రం భారీగా ఇవ్వాలి సుమా...''

''ఏడ్చావులే... నువ్వు చేసే వైద్యానికి భారీ ఫీజు ఒకటీ...''

''నన్ను అంత తేలికగా తీసెయ్యకు పిన్నీ... జబ్బు తగ్గకపోతే ఫీజు రెండింతలు వాపసు చేస్తాను''

''ఒరే విష్ణూ, మా బాధ నీకు నవ్వులాటగా ఉన్న ట్లుంది''

''ఛ... ఛ... లేదు లేదు. నేనూ సీరియస్‌గానే చెబు తున్నాను. మనం ఈ విషయం గురించి కాసేపు చర్చిద్దాం. నీవంట అయిపోతే నువ్వు కూడా కూర్చో పిన్నీ''

''వంటదేముంది లేరా... తర్వాత చేసుకోవచ్చు. ముందు ఆయన్ని అలా చూడలేకపోతున్నాను. ఈయ నలో మార్పువస్తే నాకు అంతకన్నా కావలసింది ఏముంది'' అంటూ వాళ్ళ దగ్గరగా కూర్చుంది వరలక్ష్మి.

కిటికీలోంచి ఏటవాలుగా గదిలోకి దూసుకువచ్చిన సూర్యకాంతి వరలక్ష్మి శ్రద్ధగా పెంచుతున్న ఇండోర్ ప్లాంట్‌పైబడి అది కొత్త వన్నెలతో హొయలు కురిపిం చింది.

విష్ణు ఏం చెబుతాడా అని ఆత్రంగా ఎదురు చూస్తు న్నారు వరలక్ష్మి, నారాయణ మూర్తులు.

కొద్దిసేపు దీర్ఘంగా ఆలోచించి అన్నాడు విష్ణు. బాబాయ్, నీ చిన్నతనం నుంచీ మొదలు పెడదాం. మామ్మా తాతయ్యల మాటలను బట్టి నాకు తెలిసిందే మంటే నువ్వు మంచి విద్యార్థివి. చదువుకున్నన్నాళ్ళూ నీకు చదువుతుప్ప మరో ప్రపంచం తెలియదు. డ్రిల్లు పీరియడ్‌లో అందరూ ఏవేవో ఆటలు ఆడుకుంటుంటే నువ్వు మాత్రం పుస్తకం పట్టుకుని ఒక మూల కూర్చునే వాడివట. నిజమేనా...?'' నవ్వుతూ అడిగాడు విష్ణు.

''నిజమేరా... నాకు ఆటలమీదికి మనసు పోయేది కాదు. ఫ్రెండ్స్ పిలిచినా పలక్కుండా నా చదువు నేను చదువుకునే వాడిని''

''సరే, చదువు అవగానే ఉద్యోగం వచ్చింది. ఇక అప్పటినుంచీ ఉద్యోగమే ప్రాణం అన్నట్లు గడిపావు. తరువాత పెళ్ళీ, పిల్లలు. పిల్లలిద్దరినీ మంచి చదువులు చదివించావు. వాళ్ళు ఉద్యోగాల్లో స్థిరపడ్డాక పెళ్ళిళ్ళు చేశావు. మామ్మా తాతయ్యలను చివరివరకు ప్రేమగా చూసుకున్నావు. నీ బాధ్యతలన్నీ వందశాతం సక్రమంగా నిర్వహించావు.

''నిజమే కానీ... ఇప్పుడు...''

''పూర్తి నిజంకాదు బాబాయ్... సగమే నిజం''

''సగమా...?'' ఆశ్చర్యంతో ఇద్దరి కళ్ళూ పెద్దవయ్యాయి.

''అవును సగమే...''

''సరే, ఇదంతా సగమేనంటున్నావు. మరి మిగతా సగం మాటేమిటి...?'' ఆసక్తిగా అడిగింది వరలక్ష్మి.

''అక్కడికే వస్తున్నా పినీ..., బాబాయి కొడుకుగా, భర్తగా, తండ్రిగా తన బాధ్యతలన్నీ తీర్చుకున్నాడు. మరి పొరుడిగా...?''

''పొరుడిగానా... కాస్త అర్థమయ్యేటట్లు చెప్పి ఏడువ్...'' విసుగు తొంగిచూసింది నారాయణమూర్తి గొంతులో.

''చెప్తా... చెప్తా... కంగారు పడకు బాబాయ్. నువ్వు సంపన్న కుటుంబంలో పుట్టావు. కష్టాలు ఎరుగకుండా పెరిగావు. కోరినంత చదువూ, మంచి ఉద్యోగమూ, అనుకూలవతి అయిన భార్యా, బుద్ధిమంతులైన పిల్లలూ... అసలు లోటేమన్నా ఉందా నీ జీవితంలో... ఆఫీసవర్స్‌లో ఆఫీసూ, ఇంటికి వచ్చాక టీవీ, సరదాపుడితే సినిమా, గుళ్ళూ, గోపురాలూ... అంతేగా బాబాయ్...''

''నిజమేరా... ఇంతవరకూ నా జీవితంలో ఏవో చిన్న చిన్న చికాకులే తప్ప, నువ్వు అన్నట్లు లోటనేది ఎరుగను. కానీ... ఇప్పుడు''

''ఇక ప్రస్తుతానికి వద్దాం బాబాయ్... నీ అంత సంతృ ప్తికరమైన జీవితం ఎంతమందికి లభిస్తుందో ఎప్పుడైనా ఆలోచించావా...? మన చుట్టూ వున్న ఎంతోమంది ఆర్థిక

ఇబ్బందులతో, అనారోగ్యాలతో ఎన్ని కష్టాలూ, ఎన్నెన్ని బాధలూ అనుభవిస్తున్నారో ఎప్పుడైనా గమనించావా...?''

''దానికి మనమేం చెయ్యగలంరా.... ఎవరి ఖర్మ వారిది''

''అదే పొరబాటు బాబాయ్..., నీ భార్యా, పిల్లలూ, మనుమలే కాదు నీవాళ్ళు. తోటి మానవులు కూడా నీవాళ్ళు అనుకోగలిగితే ఇప్పుడు నువ్వు అనుభవిస్తున్న నిర్వేదం నీ చెంత చేరదు. ఆపన్నులకు చేతనయినంత సహాయం చెయ్యాలి''

''అదంతా మనవల్లనేమవుతుంఇరా... నీ పిచ్చి గానీ...'' అన్నది వరలక్ష్మి.

''తలచుకుంటే మనిషి సాధించలేనిదేమీ లేదు పిన్నీ... మనం ఒంటరిగా చెయ్యలేమనకుంటే, మనవంటి వారిని మరో పదిమందిని కలుపుకుందాం''

''పదిమందీ మనమాట వింటారా...? మనతో కలిసి వస్తారా... నాకేం నమ్మకంలేదు'' అన్నాడు మూర్తి.

''అదే పెద్ద తప్పు బాబాయ్... మనం మన ఇంట్లో కదలకుండా కూర్చుని, మనం ఏం చెయ్యలేం... మనకేం సాధ్యంకాదు అనుకోకూడదు. మన ప్రయత్నం మనం చెయ్యాలి. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీకూడా ఒకప్పుడు సామాన్యుడే. అర్థబలమూ, అంగబలమూ ఏమీలేనివాడే. సత్సంకల్పమూ, దీక్షా, పట్టుదలల బలంతో ఆయన కార్యసిద్ధిని సాధించలేదా...?''

''ఆయనకూ మనకూ పోలికెక్కడ...? నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా వుంది''

''ఉండచ్చు బాబాయ్... కానీ, అందుకు మనం నిరుత్సాహం చెందనవలసరం లేదు. మన పరిధిలో మన శక్తిమేరా మనమూ కృషి చెయ్యాలి. ఒక మంచి కార్యక్రమం మొదలుపెట్టు. అప్పుడు న మనసు ఉత్సాహంతో ఎలా గంతులు వేస్తుందో చూడు''

''ఇంకా నీకు అభిరుచి ఉండాలే కానీ, లలితకళలు ఎన్ని లేవు నేర్చుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి... సంగీతమూ, సాహిత్యమూ, చిత్రలేఖనమూ... వాటిల్లో పడితే నీకసలు టైము చాలదు తెలుసా...?''

''ఈ వయసులో మనకవి అంటుతాయట్రా...?''

''విద్యకు వయసుతో పని ఏముంది బాబాయ్... అబ్దుల్ కలామ్ గారు ఈ మధ్యనే వీణ నేర్చుకున్నారట...''

''బాబాయ్, నువ్వు పెద్ద చదువులు చదివినవాడివి. వయసు రీత్యా, అనుభవాలరీత్యా పండిపోయిన వాడివి. నీ ముందు నేనెంత...? ఆలోచించు బాబాయ్... అడుగు ముందుకు వెయ్ బాబాయ్... ఇది నీకు రిటైర్‌మెంట్ కాదు, రీఛార్జ్‌మెంట్ బాబాయ్...!

తనబలం తను తెలుసుకోలేని హనుమంతునిలా ముడుచుకుని ఉన్న నారాయణమూర్తి మనసు విష్ణు మాటలతో సూర్యరశ్మి తగిలి విచ్చుకున్న తామరపువ్వులా కళకళలాడింది. ఆ కళకళలు అతని ముఖంలోకి పాకి చిరునవ్వు వెన్నెలలు కురిశాయి.

ఎన్నాళ్ళ తర్వాతో చూసిన భర్త చిరునవ్వు వరలక్ష్మికి వెయ్యేనుగుల బలం తెచ్చింది.

''విష్ణూ నీ వైద్యానికి నిజంగానే పెద్ద ఫీజు ఇవ్వాలిరా... అంత ఇచ్చుకోలేను గానీ, మంచి కోడల్ని వెతికి తెచ్చిపెడతాను...'' విష్ణు తలమీద చెయ్యివేసి ప్రేమగా నిమిరింది వరలక్ష్మి. ■

58 నిర్వాహకులు ఆ తల్లీ బిడ్డల్ని కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలతో సంతృప్తి చెందారు. వాళ్ళ పాపే అని నిర్ధారణ చేసుకున్నారు. ఫార్మాలిటీస్ పూర్తిచేసి తల్లీ బిడ్డల సంతకాలు తీసుకున్నారు. 'పిల్లల్ని అనాధలను చేసే హక్కు ఎవరికి లేదనే' హితవు చెబుతూ వాళ్ళకు పాపను అప్పగించారు.

❖ ❖ ❖

సుమ తనను నమ్మించి మోసం చేసిన అరణ్‌మీద కోర్టులో చీటింగ్ కేసు ఫైల్ చేసింది. ఆమెకు పలు మహిళా సంఘాలు బాసటగా నిలిచాయి. 'సుమ తనకు పుట్టిన ఈ బిడ్డకు అరుణే తండ్రి...' అని వాదిస్తోంది. నారీలోకం సుమకు నైతిక ధైర్యాన్ని, స్థైర్యాన్ని అందిస్తున్నాయి. 'పురుష దౌర్జన్యం' నశించాలని స్త్రీ సమాజం వెల్లు వలా పెల్లుభికింది. కోర్టు హాలులో కేసు వాద, ప్రతివాదా లతో దద్దరిల్లుతోంది. పేపర్లలో విభిన్న కథనాలు వెలు వడు తున్నాయి. జనం ఉత్కంఠతో గమనిస్తున్నారు. సుమ వాదనను ధృవీకరించుకోవటానికి జడ్జి ఆదే శాలమేరకు అరుణ్‌కు డిఎన్ఎ పరీక్ష నిర్వహించారు. కోర్టు హాల్‌లో డిఎన్ఎ పరీక్షఫలితాలు వింటున్న సుమ ముఖంలో ప్రసన్నత చోటు చేసుకోసాగింది. తెల్లవారి దినపత్రికల్లో 'పురుష దౌష్ట్యం'పై మహిళా లోకం విజయ కేతనం' అంటూ పతాక శీర్షికన ప్రచురించిన వార్తను చదివి సంతోషంతో రాఘవమ్మ హృదయం విప్పారింది. ■